RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 437 | 31 శుక్రవారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# ‘2034 వరకు నేనే సీఎం’

## - ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ



- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ

విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. “మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి” అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

# తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్..

## ఆ జిల్లాల్లో అతి భారీ వర్షాలు!



తెలుగు రాష్ట్రాల్లో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ‘ఆరెంజ్ అలర్ట్’ ప్రకటించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మంచిర్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, జగిత్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదే సమయంలో సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ‘ఎల్లో అలర్ట్’ జారీ చేస్తూ, అక్కడ భారీ వర్షాలు నమోదవుతాయని వెల్లడించింది. ఇక హైదరాబాద్ మహానగరంలోనూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసే అవకాశాలు ఉన్నందున, నగరవాసులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఉూూణహీూ) వెల్లడించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయి. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వివరించారు.

# జెర్సీ మారినా దేశ ఆత్మ మారదు..

## - ప్రియాంక గాంధీ ఘాటు వ్యాఖ్యలు



భారత హాకీ జట్టు సంప్రదాయ నీలం జెర్సీ స్థానంలో ప్రపంచకప్ కోసం కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై మొదలైన చర్చ రాజకీయ రంగు పులుముకుంది. మాజీ కెప్టెన్ వీరేన్ రస్కీన్హా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా దీనిపై స్పందించారు. జెర్సీ మార్పు ఒక్కటే కాదని, చరిత్రను మార్చే ప్రయత్నాలు జరిగినా దేశ యువత తన అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడిన ఆమె, దేశ ఆత్మను మాత్రం మార్చలేరని అన్నారు. జెర్సీ మార్చినా, విద్యా విధానంలో చరిత్రను తిరగరాయాలని చూసినా ప్రజల ఆలోచనలను మార్చడం సాధ్యం కాదని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో యువత వ్యక్తం చేసిన అభిప్రాయాలే దేశ స్వరమని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం అహింస, సత్యం అనే విలువలపై నిర్మితమైందని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ విషయాన్ని దేశ ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. సోదరభావం, ఐక్యత, సత్యం, అహింసలోనే దేశ ఆత్మ ఉందని ప్రియాంక స్పష్టం చేశారు. ద్వేషం రెచ్చగొట్టినా, హింసను ప్రోత్సహించినా భారత మూల విలువలను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని చెప్పారు. రాజకీయ భావజాలం పేరుతో దేశ స్వభావాన్ని మార్చడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్ కోసం ప్రకటించిన కొత్త జెర్సీపై భారత హాకీ మాజీ కెప్టెన్ వీరేన్ రస్కీన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత హాకీ అంటే అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చేది నీలం జెర్సీయేనని చెప్పారు. తాను ఎన్నో ఏళ్లు దాన్నే ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించానని గుర్తుచేశారు. అభిమానుల మనసుల్లో ఆ రంగుకే ప్రత్యేక స్థానం ఉందని, అలాంటప్పుడు కాషాయ రంగును ఎందుకు ఎంచుకున్నారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. రస్కీన్హా వ్యాఖ్యల తర్వాత హాకీ ఇండియా కొత్త జెర్సీ రూపకల్పన వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించింది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయానికి ప్రతీకగా ఎంచుకున్నట్లు తెలిపింది. భారత జాతీయ పతాకం, ఉదయించే సూర్యుడి స్ఫూర్తితో ఈ రంగును తీసుకున్నామని పేర్కొంది. అశోక చక్రాన్ని గుర్తు చేసే నేవీ బ్లూ అంచులు, మండల కళారూపాలు, సుదర్శన చక్రం స్ఫూర్తితో రూపొందించిన డిజైన్ భారత సంస్కృతి, ఐక్యత, పురోగతిని ప్రతిబింబిస్తుందని వెల్లడించింది. ‘ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్’ భావనకు అనుగుణంగానే ఈ జెర్సీని రూపొందించినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది.

# పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి


## : కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ



తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు. సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. “గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది“ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ఐదు రోజుల పోరాటం విఫలం..

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత



బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి

గుండెపోటుతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అస్తమయం

ఐదు రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉన్నా ఫలించని చికిత్స

2018లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సుదర్శన్‌రెడ్డి

సాధారణ రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన నేత

## పేపర్ లీక్ ముఠాలను

# ఇక సహించేది లేదు..

## మోదీ కొత్త సందేశం



పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తుచేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ పునరుద్ధరణకి సహకరిస్తా - ఎస్పీ శబరిష్

## - టీఎస్ జేయు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత..

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి మహబూబాబాద్, జులై 30 : జర్నలిస్టుల దాడుల నివారణ సంబంధించిన కమిటీని త్వరలో పునరుద్ధరణకు సహకరిస్తానని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ యూనియన్ జిల్లా నాయకులు కలసి జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ పునరుద్ధరించాలని వినతి పత్రాన్ని జిల్లా ఎస్పీ డా.శబరీష్ ఐపీఎస్ కి అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ నీ పునరుద్ధరించడానికి కావలసిన విధి విధానాలను సమీక్షించి కమిటీ ఏర్పాటుకు సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిర్రగొని ఉదయ్ ధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుగంటి సతీష్ చారి, తదితరులు పాల్గొన్నారు.



# పీఅండ్ టీ కాలనీలో నాలాపై స్లాబ్ ను త్వరితగతిన పూర్తి చేయండి..

## అధికారులతో మధుయాష్కీగౌడ్

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్
ఈ రోజు ఉదయం గౌరవనీయులు మాజీ పార్లమెంట్ సభ్యులు, టీపీసీసీ క్యాంపెయినింగ్ కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ గారు.. ఈ రోజు గడ్డి అన్నారం డివిజన్‌లోని పీఎన్‌టీ కాలనీ, హుస్సేన్ మటన్ షాప్ చౌరస్తా వద్ద రోడ్డు తవ్వి వదిలేసిన సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. సరూర్‌నగర్ చెరువుకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్ వద్ద చాంబర్‌లో గుర్రెపు డెక్క ఇరుక్కుపోయిన పరిస్థితిలో నాలా స్లాబ్‌ను తొలగించి, వాటర్‌ప్రూఫింగ్ పనులు నిర్వహించిన అనంతరం తిరిగి స్లాబ్‌ను అమర్చకుండా వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు మధుయాష్కీ గౌడ్ గారికి వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన మధుయాష్కి గౌడ్ గారు ఈ రోజు ఉదయం ఆ ప్రాంతాన్ని సందర్శించి.. డిప్యూటీ కమిషనర్, ఈఈ లతో మాట్లాడారు. వెంటనే నాలపై



కొత్త స్లాబ్ ను వేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలన్నారు. రానున్న తెలంగాణ రాష్ట్ర అతిపెద్ద పండుగ అయిన ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వెంటనే ఆ చాంబర్‌పై స్లాబ్ పనులు పూర్తి చేసి ప్రజలకు రాకపోకలు చేసేలా ఇబ్బందులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మద్దెల సునీల్ బాబు గారు, సీనియర్ నాయకులు తులసి శ్రీనివాస్ గారు, పార్టీ మాజీ అధ్యక్షులు బద్దుల వేణుగోపాల్ యాదవ్ గారు,మాజీ కౌన్సిలర్ కందికంటి ప్రేమ నాథ్ గౌడ్ గారు, బబ్బురి ఆనంద్ కుమార్ గారు, పండరీనాథ్ గారు, శరత్ యాదవ్ గారు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ కి నిరసనగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అమానుషంగా దాడి చేయించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ను కేంద్ర మంత్రివర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలి

## తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్
ఎల్బీనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివకుమార్‌లి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ మాల్ మైసమ్మ ఫ్లైఓవర్ పై వినూత్నంగా నిరసన తెలిపారు ఎల్బీనగర్ యువజన కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారుఈ సందర్భంగా శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీ కేజీకి పాల్పడిన వారిని కచ్చితంగా శిక్షించాలని, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అమానుషంగా దాడి చేయించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన




కార్యదర్శి సాయిరాం రెడ్డి, నియోజకవర్గ , ఉపాధ్యక్షులు సాయిరాం సామలేటి ,ఇర్ఫాన్, సంజు గౌడ్ ,ప్రధాన కార్యదర్శులు రూత్విక్ రెడ్డి ,జావేద్, సోషల్ మీడియా ఇంచార్జ్ తిరుపతి బి ఎన్ రెడ్డి నగర్




డివిజన్ అధ్యక్షులు నేలపాటి రాజేష్, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు కుశాల్, యువజన కాంగ్రెస్ నాయకులు ఆదిత్య, గణేష్ ,ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు...

# నేడు జిల్లా కలెక్టరేట్ల వద్ద విద్యార్థుల మహార్యాలీ

## బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

హైదరాబాద్, జూలై 30: విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31వ తేదీన శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీఓ, మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద విద్యార్థుల మహా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుజ్జ సత్యం తెలిపారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు మహా ర్యాలీల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 14లక్షల మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని, పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు అడుగుతున్నది దానం కాదని, ప్రభుత్వం



ఇచ్చిన హామీ అమలు చేయాలని మాత్రమేనని ఆయన పేర్కొన్నారు.

# భారీ వర్షాలు.. రంగారెడ్డి జిల్లాలో 24 గంటల కంట్రోల్ రూమ్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 30:-
రంగారెడ్డి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయ సేవలు అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల పరిసరాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నీటితో నిండిన రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని కలెక్టర్ సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, చెట్లు కూలే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. వర్షాల కారణంగా ముంపు, రవాణా అంతరాయం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అందిన ప్రతి సమాచారంపై సంబంధిత శాఖలు తక్షణమే



స్పందించి సహాయక చర్యలు చేపడతాయని పేర్కొన్నారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్లు: 040-23237416, 9704958473.

# మత్స్యరంగ అభివృద్ధికి రూ.2.208 కోట్ల నిధులు విడుదల

## బీజేపీ మత్స్య విభాగం రాష్ట్ర కో కన్వీనర్ ఎల్.వి.రమణ ముదిరాజ్



హైదరాబాద్, జూలై 30: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్ వై)
కింద దేశంలోని మత్స్యకారుల సంక్షేమం, ఆక్వాకల్చర్ వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,208.74 కోట్లు నిదులు విడుదల చేయడం పట్ల తెలంగాణ మత్స్యకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, బీజేపీ మత్స్య విభాగం రాష్ట్ర కో కన్వీనర్ ఎల్.వి.రమణ ముదిరాజ్ హర్షం ప్రకటించారు. గురువారం హైదరాబాద్ నగరంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గత మూడేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలవల్ల నీలి విప్లవం (బ్లూ రెవల్యూషన్) మరింత బలపడిందని అన్నారు. దేశంలో మత్స్య ఉత్పత్తి 141.64 లక్షల టన్నుల నుండి 197.75 లక్షల టన్నులకు (39.61శాతం) ఎగుమతులు రూ.46,666 కోట్ల నుండి రూ.73,890 కోట్లకు (58.35శాతం) పెరిగాయని తెలిపారు. రాష్ట్రాల పనితీరు, నిధుల వినియోగ సామర్థ్యం ఆధారంగా పారదర్శకంగా ఈ నిధులు కేటాయించబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 'పిఎంఎంఎస్వై మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం' డిజిటల్ పోర్టల్ ద్వారా పనులను పర్యవేక్షించడం అభినందనీయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని ప్రతి మత్స్యకారునికి చేరువ చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నట్లు ఎలివి.రమణ ముదిరాజ్ స్పష్టం చేశారు.

# ఉప్పరిగూడ గ్రామసభ గర్జన.. బెల్టు షాపులకు గుడ్‌బై

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 30:-
ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో మద్యం విక్రయాలను అరికట్టేందుకు గ్రామసభ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధిస్తూ గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది. గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ సర్పంచ్ బోసుపల్లి శ్రీవేణి నందకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యపానం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ముఖ్యంగా యువత మద్యానికి బానిసలై తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాన్ని మద్యరహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్రామసభ ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదించిందన్నారు. ఇకపై గ్రామ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహించినా, బెల్ట్ షాపులు కొనసాగించినా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న వారికి అధికారికంగా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ఉప్పరిగూడను మద్యరహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామసభ పిలుపునిచ్చింది.



# నల్లగొండ జిల్లా మత్స్య శాఖ నూతన అధికారిని కలిసిన ఎల్ వి రమణ ముదిరాజ్



నల్లగొండ, జూలై 30: నల్లగొండ జిల్లా మత్స్య శాఖ నూతన అధికారిగా బాధ్యతలు చేపట్టిన సుకీర్తి గారిని తెలంగాణ రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ సంఘం (టిఆర్ఎంఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, బిజెపి నాయకులు ఎల్వి రమణ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. జిల్లాలోని మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఈ సందర్భంగా అధికారి గారికి వివరించి, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమం కోసం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి మత్స్యకారుడికి అందించేలా చర్యలు తీసుకోవాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎల్ వి రమణ ముదిరాజ్‌తో పాటు పలువురు మత్స్యకార సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్నం కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 30:-
పట్నం మహేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డిల తల్లి రుక్కమ్మ మృతి పట్ల బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న వెంటనే షాబాద్‌లోని పట్నం కుటుంబ నివాసానికి చేరుకున్న ఆయన రుక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో తాను భాగస్వామినని తెలిపారు. ఈ కష్టకాలాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పార్టీ తరఫున అవసరమైన ప్రతి విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కూడా రుక్కమ్మకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరమణ రెడ్డి, యాచారం మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వారు రుక్కమ్మ మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పట్నం కుటుంబానికి సంఘీభావం ప్రకటిస్తూ, ఈ విషాద సమయంలో పార్టీ నాయకులందరూ కుటుంబానికి అండగా ఉంటారని తెలిపారు.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
31 శుక్రవారం జూలై 2026

## పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన దాస్యం వినయ్ భాస్కర్

### యశోద ఆస్పత్రిలో వైద్యులతో ఆరా.. కుటుంబ సభ్యులకు ధైర్యం



హైదరాబాద్, జులై 30 హైదరాబాద్ ఎస్టేట్: తీవ్ర అస్వస్థతతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ గురువారం పరామర్శించారు. సుదర్శన్‌రెడ్డికి అందుతున్న వైద్య చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న వినయ్ భాస్కర్, అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వైద్యుల చికిత్సతో సుదర్శన్‌రెడ్డి త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యంపై బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ నాయకత్వం నిరంతరం ఆరా తీస్తోందన్నారు. ఆయన త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# ఓపీఎస్ అమలు చేయాలి..

- లేదంటే సెప్టెంబర్ 1 నుంచి ఉద్యమం
- పీఆర్సీని వెంటనే ప్రకటించాలి..
- గీసుగొండలో పీఆర్టీయూ-టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి







గీసుగొండ, జులై 30 హైదరాబాద్ ఎస్టేట్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు, ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పీఆర్టీయూ-టీఎస్ గీసుగొండ మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఆలస్యం చేయరాదన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయినుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 సౌకర్యాల అమలుకు సంఘం కృషి కొనసాగిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ-టీఎస్ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి మార్త శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, జిల్లా కార్యదర్శి రవీందర్‌రెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షుడు బొల్లం రవి తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేళ వేద పండితులకు ఘన సన్మానం

### బీజేపీ ఎండోమెంట్ స్టేట్ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం





వరంగల్, జులై 30 హైదరాబాద్ ఎస్టేట్: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఎండోమెంట్ స్టేట్ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో వరంగల్ ధార్మిక భవన్‌లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు తాతభట్ల నరసింహమూర్తి, వైజయంతుల శ్రీరాములు మధుశర్మలను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ఎండోమెంట్ స్టేట్ ధార్మిక పరిషత్ జాయింట్ కన్వీనర్ దేవి ప్రసాద్, జిల్లా కన్వీనర్ బాలు, కో-కన్వీనర్ నాగిళ్ల వేణుశర్మ పాల్గొని వేద పండితులను సన్మానించారు. గురువుల మార్గదర్శకత్వం భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, లలిత్ కిషోర్, మహేష్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట-2 గనిపై ఘనంగా మెగా ప్లాంటేషన్

## 2000 మొక్కలు నాటిన డి.ఎఫ్.ఓ రాహుల్ కిషన్ జాదవ్, జి.ఎం రాధాకృష్ణ





హైదరాబాద్ ఎస్టేట్ 30 జులై 2026
పర్యావరణ పరిరక్షణ మరియు పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో సింగరేణి మంచిర్యాల జిల్లా మందమరి ఏరియా పరిధిలోని కాసిపేట రెండవ గని ప్రాంగణంలో గురువారం మెగా ప్లాంటేషన్ (విస్తృత మొక్కల పెంపకం) కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా అటవీ శాఖాధికారి (ఐఖీూ / ఐఖీూ) రాహుల్ కిషన్ జాదవ్ మరియు మందమరి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, విజయకుమార్, ఎ ఫ్ ఓ, బెల్లంపల్లి, పూర్ణచందర్, ఎఫ్ ఆర్ ఓ, బెల్లంపల్లి, సర్వేశ్వరరావు, ఎ ఫ్ ఓ మంచిర్యాల్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. మొక్కలు నాటడం భావి తరాల భవిష్యత్తుకు మార్గం. ఈ సందర్భంగా డి.ఎఫ్.ఓ, రాహుల్ కిషన్ జాదవ్ మాట్లాడుతూ... ఆహ్లాదకరమైన వాతావరణంలో సింగరేణి ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా కార్మికులు అత్యంత ఉత్సాహంతో ముందుకు వచ్చి మొక్కలు నాటడంలో భాగస్వాములు కావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఒక మొక్కను నాటడం అంటే ఒక ప్రాణాన్ని నిలబెట్టడమే. పచ్చదనమే జీవకోటికి ప్రాణాధారం. మారుతున్న వాతావరణ మార్పులను తట్టుకోవాలన్నా, కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాలన్నా ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో, పని ప్రదేశాల్లో మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలి. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యత ఎంతో ఆదర్శనీయం అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మందమరి ఏరియా జీఎమ్ ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ.

హ్లాదకరమైన వర్షపు వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒకే రోజు 2,000 మొక్కలు కాసిపేట-2 గని పైనాటడం అభినందనీయమని అన్నారు. సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాలతో పాటు, పర్యావరణ సమతుల్యత కోసం ఈ ఏడాది 38 హెక్టార్ల 'సిఏ' మరియు సింగరేణిలో ఖాళీగా ఉన్న ల్యాండ్స్‌లో మొత్తం 1,80,000 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (MoEF) నిబంధనలకు అనుగుణంగా సింగరేణి పరిధిలోని 19 ఓపెన్ కాస్ట్ గనుల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలను పక్కాగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం ఒక సంస్థకో లేదా ప్రభుత్వానికో పరిమితం కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. కేకే ఓ సి పి లోని సిఏ ల్యాండ్స్ ను రాహుల్ కిషన్ జాదవ్ డి.ఎఫ్.ఓ మంచిర్యాల్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం జివిఎల్ ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, కాసిపేట-2 గని మేనేజర్ బారపాటి రమేష్, కేకే ఏజెంట్ కాదిర్, శాంతి కానీ ఏజెంట్ సంతోష్ కుమార్, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, మందమరి ఏరియా ఉన్నత అధికారులు, మందమరి ఏరియా జిఎం ఆఫీస్ అధికారులు , సిబ్బంది మరియు గని సంక్షేమ అధికారి భార్గవ్ , గని ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఎగుమతులే లక్ష్యం.. ఎగుమతుల హబ్ గా రంగారెడ్డి జిల్లా




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 30:-
రంగారెడ్డి జిల్లాను ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా కలెక్టరేట్‌లో గురువారం మెగా ఎగుమతి ప్రోత్సాహక సదస్సు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణలో ఎగుమతుల అభివృద్ధికి రంగారెడ్డి జిల్లా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం, మెరుగైన రవాణా సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం వంటి అంశాలు జిల్లాకు ప్రత్యేక బలంగా నిలిచాయని తెలిపారు. సమాచార సాంకేతికం, రక్షణ, అంతరిక్ష, ఔషధ తయారీ, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్, ఆహార ప్రాసెసింగ్, సౌర పరికరాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఖనిజ ఆధారిత పరిశ్రమలు వంటి రంగాల్లో జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.
'డిస్ట్రిక్ట్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్' కార్యక్రమంలో భాగంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీఈ) సమన్వయంతో ఈ సదస్సు నిర్వహించారు. జాయింట్ డీజీఎఫ్‌టీఈ ఎస్.ఎ. చవాన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం. శ్రీలక్ష్మి, ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకురాలు ఎన్. సుమతి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏపీఈడీఏ, వాల్‌మార్ట్, ఇండియా పోస్ట్ ప్రతినిధులు తమ సేవలు, అవకాశాలపై పారిశ్రామికవేత్తలకు వివరించారు. సదస్సులో ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, ఎగుమతి విధానాలు, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక సహాయం, అంతర్జాతీయ మార్కెటింగ్, ఇ-కామర్స్ ద్వారా ఉత్పత్తుల విక్రయం, విదేశీ మార్కెట్లలో వ్యాపార విస్తరణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఎగుమతుల సమయంలో పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తెలుసుకొని, వాటి పరిష్కార మార్గాలను వివరించారు. జిల్లాలో మరిన్ని పరిశ్రమలు ఎగుమతుల రంగంలోకి రావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఖరీఫ్‌కు యూరియా కొరత రాకూడదు

- ముందస్తు కేటాయింపులతో రైతులకు సకాలంలో సరఫరా చేయాలి
- రాజ్యసభలో కేంద్రానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విజ్ఞప్తి




న్యూఢిల్లీ, జులై 30 హైదరాబాద్ ఎస్టేట్:
ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రైతులు యూరియా కోసం క్యూలైన్లలో నిలబడే పరిస్థితి మళ్లీ తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, అవసరమైన మేర యూరియాను సకాలంలో కేటాయించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాజ్యసభ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక అని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమై ఉన్నందున ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకూడదన్నారు. గత ఏడాది యూరియా కొరతతో రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చిందని, పలుచోట్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కేంద్రాన్ని కోరారు. గత ఖరీఫ్ అనుభవం ఎరువుల కేటాయింపు, పంపిణీలో ఉన్న లోపాలను స్పష్టంగా బయటపెట్టిందని పేర్కొన్నారు. రైతు సంఘాలు, ప్రజాప్రతినిధుల హెచ్చరికలు ఉన్నప్పటికీ ఆలస్యంగా స్పందించడం వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు చేసిన విజ్ఞప్తితో అదనపు యూరియా విడుదల కావడం వల్ల పరిస్థితి కొంత మెరుగుపడిందన్నారు. ప్రస్తుతం కొరత ఏర్పడిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా ముందుగానే తెలంగాణ అవసరాలకు అనుగుణంగా యూరియా కేటాయింపులు జరపాలని, ప్రతి జిల్లాకు సకాలంలో సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, మండల స్థాయిల్లో బఫర్ నిల్వలు ఏర్పాటు చేసి, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను అరికట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైతులకు ఖరీఫ్ సీజన్ మొత్తం యూరియా సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ, ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.

## "మిషన్-80" ప్రపంచ రికార్డు పోస్టర్ ఆవిష్కరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




హైదరాబాద్, జూలై 30:
భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "మిషన్-80" ప్రపంచ రికార్డు ప్రయత్నం పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన కార్యాలయంలో గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. కరాటే రంగంలో విశేష సేవలందిస్తున్న వి. సుధాకర్ చేపట్టనున్న ఈ వినూత్న ప్రపంచ రికార్డు ప్రయత్నం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణమని పేర్కొన్నారు. సుధాకర్ విజయవంతంగా ప్రపంచ రికార్డు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. 09 ఆగస్టు 2026న ఉదయం 9 గంటలకు హైదరాబాద్, నారాయణగూడ లోని డా. జి.ఎస్. మెల్కోటే పార్క్ లో జరగనున్న ఈ కార్యక్రమంలో వి. సుధాకర్ కేవలం 8 నిమిషాల్లో 9 రకాల కరాటే బాడీ టెక్నిక్స్ ఉపయోగించి 80 షాబాద్ టైల్స్‌ను బద్దలు కొట్టి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నం భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నివాళిగా, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్న గౌడ్, జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి, ప్రపంచ రికార్డు ప్రయత్నకర్త వి. సుధాకర్, అమృత రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, క్రీడాభిమానులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ చారిత్రాత్మక ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
31 శుక్రవారం జూలై 2026

# విద్యా రంగంలో దేశానికి ఆదర్శం కావాలి : సీఎం రేవంత్ రెడ్డి







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 30:-
మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను పూర్తి చేసిన ప్రతి విద్యార్థి నైపుణ్యాలు (స్కిల్స్) కలిగిన యువకుడిగా తీర్చిదిద్దాలని, ఇందుకు ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ దాశరథి ఆడిటోరియంలో "టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్సేంజ్" కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా అధ్యయన పర్యటన పూర్తి చేసుకున్న ఉపాధ్యాయ ప్రతినిధులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవగాహన, నైపుణ్యాలు, క్రమశిక్షణ కల్పించే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. ఉపాధ్యాయులు సమస్యల కోసం అడగాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి బదిలీలు, పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందన్నారు. డీఎస్సీ ద్వారా 55 రోజుల్లోనే 11 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తుచేశారు.వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన సంస్కరణలపై డిసెంబరులోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని, వచ్చే ఐదేళ్లలో తెలంగాణ విద్యా రంగాన్ని దేశానికే మోడల్‌గా నిలపాలని పిలుపునిచ్చారు. అమెరికాతో పాటు జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, చైనా వంటి దేశాల అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. భాషతో పాటు నైపుణ్యాలు ఉంటే విదేశాల్లో లక్షల రూపాయల జీతాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో సుమారు 9 శాతం విద్యా రంగానికే కేటాయిస్తున్నామని, 27.5 లక్షల మంది విద్యార్థులపై ఒక్కొక్కరికి సగటున రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగడం విద్యా రంగంలో జరుగుతున్న మార్పులకు నిదర్శనమని పేర్కొన్నారు. సమావేశానికి ముందు ఫిన్లాండ్, జర్మనీ పర్యటనకు వెళ్లిన ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సీఎం సందర్శించారు. ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావుతో పాటు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే KR నాగరాజు గారు...



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
హసన్పర్తి ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఎమ్మెల్యే గారికి అధికారులు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...సర్పంచులు,అధికారులు సమన్వయంతో గ్రామ ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఎల్ నీనో ప్రభావం వల్ల సర్పంచులు ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.గ్రామాల్లో మత్తుపదార్థాలపై యువతకు అవగాహన కల్పించి మత్తు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు.ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యమై ప్రజలకు అందుతున్నాయో లేదో అధికారుల దృష్టికి తీసుకోపోవాలని తెలిపారు.తడి,పొడి చెత్తపై ఇప్పటికే గ్రామాలలో అవగాహన కల్పించమని,అయినప్పటికీ వాటిని పాటించడం లేదని ఇందులో సర్పంచులు సంబంధిత అధికారులు సమన్వయంతో ఉదయం వాకింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసుకొని గ్రామ ప్రజలకు మరోమారు అవగాన కల్పించాలన్నారు.త్రాగునీటి సమస్యలు ఉంటే వెంటనే అధికారులు పరిష్కరించాలన్నారు.గ్రామాల్లో చెట్లను నాటే కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని సర్పంచులకు,అధికారులకు ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు.వైద్య,విద్యా,వ్యవసాయ విషయంలో ఎప్పటికప్పుడు అధికారులు గ్రామ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో 16 అంశాలపై మాట్లాడి, సర్పంచులతో,అధికారులతో చర్చించారు.అనంతరం రేపు రిటైర్మెంట్ కాబోతున్న ఎంపివో కరుణాకర్ రెడ్డి గారికి అధికారులు,సర్పంచులతో కలిసి ఎమ్మెల్యే గారు ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు సేవలందించినందుకు శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శేషాద్రి,డీఆర్డివో పిడి శ్రీనివాస్,స్పెషల్ ఆఫీసర్ మోహన్,మండల అధ్యక్షులు అశోక్,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి,సర్పంచులు,ఎంపీడీఓ,ఎమ్మార్వో,ఎంయివో,డిఈలు,ఏఈలు,ఏవోలు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నీటి వనరుల పునరుద్ధరణపై పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

న్యూఢిల్లీ -పార్లమెంట్
హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తేది:30-07-2026
వరంగల్ జిల్లాలో చెరువులు, కుంటలు, నీటి వనరుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు కోసం కేంద్రం అందిస్తున్న సహాయం, చేపట్టిన పనుల పురోగతిపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ముఖ్యంగా జిల్లాలో నీటి వనరుల పునరుద్ధరణ కేవలం అభివృద్ధి అంశం మాత్రమే కాదని, వ్యవసాయం, తాగునీటి భద్రత, భూగర్భ జలాల సంరక్షణకు ఇది అత్యంత కీలకమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రస్తావించారు. గత మూడు సంవత్సరాల్లో కేంద్ర సహకారంతో చేపట్టిన పనులు, కేటాయించిన నిధులు, వాటి ఫలితాలపై పూర్తి వివరాలు కోరారు.
వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజనలోని వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ (ఔణజ-ూాఫీఖు 2.0) కింద వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో రూ.10.16 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు అమలవుతోంది. ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.3.17 కోట్ల కేంద్ర సహాయం విడుదలైంది. ప్రాజెక్టు ద్వారా 2.64 లక్షల క్యూబిక్ మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం సృష్టించడంతో పాటు 235.20 హెక్టార్లలో విభిన్న పంటల సాగు విస్తరించగా, 54.40 హెక్టార్లలో ఒకే పంట లేదా సాగులేని భూములను బహుళ పంటల సాగులోకి తీసుకొచ్చినట్లు కేంద్రం వెల్లడించింది.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద గత మూడేళ్లలో వరంగల్ జిల్లాలో 5,369 నీటి సంరక్షణ, నీటి నిల్వలకు సంబంధించిన పనులు రూ.85.65 కోట్ల వ్యయంతో పూర్తయ్యాయి. వీటిలో 715 సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ పనులు ఉండగా, వాటిపై రూ.47.90 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, కేంద్రం వెల్లడించిన గణాంకాలు వరంగల్ జిల్లాలో నీటి వనరుల ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయని అన్నారు. అయితే కాగితాలపై ఉన్న ప్రగతి కంటే ప్రజలకు కనిపించే



ఫలితాలే ముఖ్యమని పేర్కొన్నారు. రాయపర్తి ప్రాజెక్టుకు మిగిలిన నిధులు త్వరితగతిన విడుదల చేయడంతో పాటు, అమృత్ 2.0 కింద నర్సంపేట, పరకాల, వర్ధన్నపేటలో చేపట్టిన పనులు నిర్ణీత గడువులో పూర్తి కావాలని కేంద్రాన్ని కోరారు.అలాగే చెరువులు, కుంటలు, నీటి వనరుల పునరుద్ధరణను జిల్లా వ్యాప్తంగా విస్తరించి, భూగర్భ జలాల పెంపునకు 'సాచురేషన్ మోడ్'లో కార్యక్రమాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ భవిష్యత్ నీటి భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం మరింత కృషి చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష: నారా లోకేశ



ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్‌ప్రాక్టీస్‌కు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026 లోక్‌సభలో ఆమోదం పొందడంపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని చెప్పారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడే దిశగా ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు.సోషల్ మీడియా వేదికగా స్పందించిన లోకేశ్.. ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల మోసాలకు పాల్పడే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమని, ప్రతిభ, పారదర్శకత, సమాన అవకాశాలే ఎప్పుడూ గెలవాలని ఆకాంక్షించారు.నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించిందని లోకేశ్ అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షను తిరిగి సమయానికి నిర్వహించి, లక్షలాది మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా కాపాడిందని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని పేర్కొన్నారు.ఇదే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. ఈ బిల్లు లక్షలాది మంది విద్యార్థుల ఆశయాలను కాపాడే కీలక చట్టమని చెప్పారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే నిర్ణయమిదని అభిప్రాయపడ్డారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో సమగ్ర సంస్కరణల కోసం నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేయడం కూడా కీలక చర్యగా పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చొరవతో గౌడ సంఘానికి స్థలం కేటాయింపు.

## అధికారులతో కలిసి కుంట్లూర్ లో స్థల పరిశీలన

ఈరోజు కుంట్లూర్ గౌడ సంఘం పెద్దలతో గౌరవ స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి, సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేయడం జరిగింది. మా విజ్ఞప్తిపై వెంటనే సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గారు స్థలాన్ని కేటాయిస్తూ సంబంధిత రెవెన్యూ అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అధికారులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించాము.

# మైనర్ బాలికపై లైంగిక దాడి నిందితుడు అరెస్ట్



హైదరాబాద్ ఎస్టేట్స్
తుంగతుర్తి నియోజకవర్గం అడ్డగూడూర్ మండలానికి చెందిన ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన అడ్డగూడూర్ మండలానికి చెందిన వ్యక్తి ఎలిజాల ఉమేష్ వయస్సు 24 సంవత్సరాలు ను రిమాండ్ కు తరలించినట్లు రామన్నపేట సిఐ ఎం రవి తెలిపారు. బాధితురాలు తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 28 తారీకు నాడు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా అదే రోజు రాత్రి బాలిక కుటుంబ సభ్యులకు కనిపించగా ఆమెను భువనగిరి భరోసా కేంద్రానికి తరలించి వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు తెలిపారుబాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కిడ్నాప్ కేసు ఫోక్సో కేసు పలు శిక్షల కింద నమోదు చేసినట్లు వెల్లడించారు ప్రాథమిక దర్యాప్తులో నిందితుడు గత మూడేళ్లుగా ప్రేమ పేరుతో బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని సీఐ రవి తెలిపారు అనంతరం నిందితుడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు ఈ మీడియా సమావేశంలో ఎస్ఐ వెంకటరెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారుద

# ఆగస్టు10న కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు యాదగిరి



హైదరాబాద్ ఎస్టేట్స్ తుంగతుర్తి నియోజకవర్గం అడ్డగూడూరు మండలం
కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,కర్షక,కూలీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ రోజు అడ్డగుడూర్ మండల కేంద్రంలోని స్థానిక యం. ఆర్ ఫంక్షన్ హాల్లో సీఐటీయూ,రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు యాదగిరి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ, నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు.రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో,వ్యవసాయానికి అవసరమైన మద్దతు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.నిత్యావసర వస్తువుల ధరలు,గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు.గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించడం లేదని వీబీజీరామ్ గా పేరు మార్చి నిర్వీర్యం చేస్తుందని,కూలి రేట్లు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం,నిరుద్యోగాన్ని పెంచే విధానాలు అమలు చేయడం, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను నిర్లక్ష్యం చేయడం ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమని విమర్శించారు.ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, యువజనులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు పోట్ల యాదమ్మ,సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బుర్రు అనిల్ కుమార్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వళ్ళంబట్ల శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ వర్కర్స్ మండల అధ్యక్షులు బాలెంల మల్లయ్య,గ్రామ పంచాయితీ కార్మికులు,రాము,సైదమ్మ,పద్మ,డప్పు కిష్టయ్య,బోడ మల్లమ్మ,కందుకూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్రను వాయిదా వేస్తున్నా

## : అంబటి రాంబాబు



తన నివాసంపై జరిగిన దాడికి సంబంధించి నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ తలపెట్టిన 'వినతి యాత్ర' పాదయాత్రను మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తాత్కాలికంగా వాయిదా వేశారు. గుంటూరులోని తన నివాసంలో పార్టీ నేతలతో అత్యవసరంగా సమావేశమైన అనంతరం ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. త్వరలోనే పాదయాత్రకు సంబంధించి కొత్త తేదీని ప్రకటిస్తానని తెలిపారు.గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... ఆగస్టు 7, 8 తేదీల్లో గుంటూరులోని తన నివాసం నుంచి మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం వరకు రెండు రోజుల పాటు ఈ నిరసన పాదయాత్ర చేపట్టాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వైసీపీ అదే సమయంలో రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. పార్టీ అధిష్ఠానం చేపడుతున్న ముఖ్యమైన నిరసన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, తన సొంత పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు అంబటి స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# రవితేజా కుటుంబం నుంచి మరో హీరో...

## 'మారెమ్మ' రిలీజ్ డేట్ ఫిక్స్




మాస్ మహారాజా రవితేజ కుటుంబం నుంచి మరో యువ నటుడు తెలుగు తెరకు పరిచయం కాబోతున్నాడు. రవితేజ సోదరుడి కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మారెమ్మ'. ఈ సినిమా విడుదల తేదీని చిత్ర బృందం బుధవారం ప్రకటించింది. సెప్టెంబర్ 10న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.
మాధవ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు మంచాల నాగరాజ్ తెరకెక్కించిన గ్రామీణ నేపథ్య యాక్షన్ డ్రామా 'మారెమ్మ'. నిర్మాణ సంస్థ 'మోక్ష ఆర్ట్స్' తమ సోషల్ మీడియా వేదికగా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ, "రక్తం, నమ్మకం, త్యాగంతో కూడిన ఒక సాహసోపేతమైన కథ మిమ్మల్ని భావోద్వేగ ప్రయాణంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 10, 2026న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఘనంగా విడుదల కానుంది" అని పేర్కొంది. చిత్ర బృందం విడుదల చేసిన తాజా పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఇందులో మాధవ్ ఉగ్రరూపంలో, పోరాటంలో అలసిపోయినట్లుగా కనిపిస్తున్నారు. నాటకీయత ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్‌లో కథానాయకుడికి, ఒక పవిత్రమైన గోవుకు మధ్య ప్రతీకాత్మకమైన ముఖాముఖిని ఆసక్తికరంగా చూపించారు. 'మారెమ్మ' చిత్రం ద్వారా మంచాల నాగరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'మోక్ష ఆర్ట్స్' బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, పాటలు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తనదైన గ్రామీణ కథా శైలితో ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటోందన్న సంకేతాలను ఇచ్చింది. గ్రామీణ నేపథ్యంలో సాగే 'మారెమ్మ', స్థానిక సంప్రదాయాలతో కూడిన భావోద్వేగభరితమైన యాక్షన్ డ్రామాగా రూపొందింది. బలమైన మానవ సంబంధాలను ఈ కథ ఆవిష్కరిస్తుందని చిత్ర బృందం వెల్లడించింది. ఈ సినిమాలో దీపా బాలు కథానాయికగా నటిస్తోంది. సాంకేతిక విభాగంలో ప్రశాంత్ ఆర్. విహారి సంగీతం అందించగా, ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు.

# బిగ్ బాస్ అవకాశాన్ని వదులుకున్నా..

## కారణం ఇదే: సత్యశ్రీ



బుల్లితెరపై పాపులర్ కామెడీ షో 'జబర్దస్త్' ద్వారా గుర్తింపును సంపాదించుకున్న నటి సత్యశ్రీ. ముఖ్యంగా చమ్మక్ చంద్ర టీమ్‌లో సుదీర్ఘకాలం అలరించిన ఆమె, తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ గుర్తింపుతోనే వెండితెరపైనా వరుస అవకాశాలు దక్కించుకుంటూ నటిగా ముందుకు సాగుతోంది. అయితే గత కొంతకాలంగా ఆమె బుల్లితెర బిగ్గెస్ట్ రియాలిటీ షో 'బిగ్‌బాస్'లోకి ఎంట్రీ ఇవ్వబోతోందంటూ నెట్టింట ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సత్యశ్రీ ఈ ప్రచారంపై స్పందిస్తూ అసలు నిజాలను వెల్లడించింది. తనకు బిగ్‌బాస్ నిర్వాహకుల నుంచి పిలుపు వచ్చిందనేది వాస్తవమేనని, ఆఫర్ వచ్చిందని స్పష్టం చేసింది. అయితే ఆ క్రేజీ అవకాశాన్ని తాను ఒప్పుకోలేకపోయానని తెలిపింది. తనపై కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయని, ఇంటి బయట తాను చూసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయని పేర్కొంది. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులను వదిలి సుదీర్ఘకాలం దూరంగా ఉండటం తన వల్ల కాదని, అందుకే బిగ్‌బాస్ ఆఫర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె టీవీ షోలతో పాటు సినిమాల్లోనూ నటిస్తూ తన కెరీర్‌ను బిజీగా గడిపేస్తోంది.

# ముచ్చటగా మూడోసారి?



అగ్ర కథానాయిక పూజాహెగ్డే తెలుగులో పూర్వవైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. ప్రస్తుతం తెలుగులో దుల్కర్‌సల్మాన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నదీ భామ. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో ఆమెనే కథానాయిక అని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పూజాహెగ్డే టాలీవుడ్‌లో మరో భారీ ఆఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. అగ్ర హీరో అల్లు అర్జున్‌తో ఈ సొగసరి ముచ్చటగా మూడోసారి జోడీకట్టబోతున్నదని వార్తలు వినిపిస్తున్నాయి.
వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం అల్లు అర్జున్ సైన్స్ ఫిక్షన్ 'రాకా'లో నటిస్తున్నారు. అట్లీ దర్శకుడు. ఈ సినిమా పూర్తయిన తర్వాత లోకేష్ కనకరాజ్ డైరెక్షన్‌లో బన్నీ సినిమా కన్‌ఫర్మ్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన కూడా వెలువడింది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. గతంలో అల్లు అర్జున్-పూజాహెగ్డే జోడీ 'డీజే' 'అల వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో కలిసి నటించారు.

# మౌనం ప్రమాదకరం..

## నోరు విప్పండి: మంచు లక్ష్మి



సమాజంలో జరుగుతున్న పరిణామాలపై పౌరుల మౌనం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నోరు విప్పాలని సినీ నటి, నిర్మాత మంచు లక్ష్మి పిలుపునిచ్చారు. 'మనకెందుకులే' అని దాటుకెళ్లే మనస్తత్వాన్ని వీడి, ప్రజా సమస్యలపై గళం విప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లడఖ్ రాజ్యాంగ హక్కులు, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు మద్దతు ప్రకటిస్తూ ఆమె ఇన్స్టాగ్రామ్‌లో ఒక సందేశాన్ని పంచుకున్నారు. దేశంలో ఏ విపత్తు లేదా సమస్య వచ్చినా తమకేమీ పట్టనట్లు ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతమని మంచు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. అందరూ రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సిన పనిలేదని.. కనీసం సామాజిక మాధ్యమాల ద్వారానైనా గొంతు కలపడం, విషయాలపై అవగాహన పెంచుకోవడం పౌరులుగా మన బాధ్యత అని గుర్తుచేశారు. నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడే వాంగ్‌చుక్ వంటి యోధులకు సమాజం అండగా నిలవాలని కోరారు. కేవలం రాజకీయ నాయకులను వేలెత్తి చూపడంతో బాధ్యత తీరిపోదని, దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పౌరులు కార్యోన్ముఖులు కావాలని కోరారు. చుట్టూ జరుగుతున్న పరిస్థితులను చూస్తూ ఊరుకోవడం తనను తీవ్రంగా కలచివేస్తోందని ఆమె భావోద్వేగానికి గురయ్యారు.

# వైట్ డ్రెస్‌లో క్యూట్‌గా మెరిసిన నిధి అగర్వాల్





టాలీవుడ్ అందాల భామ నిధి అగర్వాల్ తన గ్లామరస్ లుక్స్‌తో సోషల్ మీడియాలో ఎప్పుడూ రచ్చ చేస్తూనే ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోషూట్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తెల్లటి లెహంగాలో దేవకన్యలా మెరిసిపోతున్న నిధి పిక్స్ చూసి అభిమానులు ఫిదా అయిపోతున్నారు. రాయల్ ఎలిగెన్స్, మోడర్న్ స్టైల్ కలబోతగా ఉన్న ఆమె ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విశేషాలేంటో ఇప్పుడు చూద్దాం.. వైట్ ఇండియన్ సిండ్రెల్లా నిధి: ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో నిధి అగర్వాల్ తెల్లటి డిజైనర్ లెహంగా చోళీ ధరించి మెరిసిపోయింది. ఇక ఆ డ్రెస్‌పై చేసిన ముత్యాలు, సీక్విన్స్, మెరిసే ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. మ్యాచింగ్ పారదర్శక దుపట్టాతో ఒక దేవకన్యలా, వైట్ సిండ్రెల్లా లాగా కనిపిస్తూ నెటిజన్ల మనసు దోచుకుంటోంది. రాయల్ లుక్‌లో అదరగొట్టిన భామ: డ్రెస్‌కు తగ్గట్టుగానే నిధి తన జ్యువెలరీ సెలక్షన్ విషయంలో కూడా మంచి కేర్ తీసుకుంది. ఇక పింక్, గ్రీన్ కలర్ స్టోన్స్ ఉన్న హెవీ చోకర్ నెక్లెస్, దానికి తగ్గట్టుగా ఉన్న కమ్మలు ధరించి రాయల్ లుక్‌లో మెరిసింది. లైట్ మేకప్, లూజ్ హెయిర్‌స్టైల్, ముఖంపై ఉన్న చిన్న బొట్టు ఆమె సాంప్రదాయ లుక్‌ను హైలెట్ గా నిలబెట్టాయి. కెరీర్ ప్రయాణం.. హిట్ చిత్రాలు: తెలుగులో నాగార్జున అక్కినేని సమర్పణలో వచ్చిన 'సవ్యసాచి' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన నిధి, రామ్ పోతినేని 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మాస్ ఆడియన్స్‌కు దగ్గరైంది. ఇక ఆ తర్వాత తమిళంలో 'ఈశ్వరన్', అలాగే 'కలగ తలైవన్', 'హీరో' వంటి సినిమాల్లో నటించి నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. కొత్త ప్రాజెక్ట్‌ల కోసం ఎదురుచూపులు: ఇటీవల రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్' సినిమాలో కనిపించినా, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా ప్రభావం చూపలేకపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో నిత్యం ఫోటోషూట్లతో సందడి చేస్తున్న ఈ భామ, తన తదుపరి సినిమాల ప్రకటనను త్వరలోనే వెల్లడిస్తుందని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్లామర్‌తో పాటు నటనలోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న నిధి అగర్వాల్, తన ట్రెండీ అండ్ రాయల్ పిక్స్‌తో కుర్రకారును ఆకట్టుకోవడంలో ఎప్పుడూ ముందే ఉంటుంది. ఈ వైట్ డ్రెస్‌లో ఆమె విజువల్స్ నిజంగానే కంటికి విందుగా ఉన్నాయి. త్వరలోనే ఆమె మంచి ప్రాజెక్ట్‌తో బిగ్ స్క్రీన్ పై మళ్ళీ అలరించాలని ఆశిద్దాం.

# కల్యాణ్‌రామ్ కొత్త సినిమా



ప్రస్తుతం వెంకటేష్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమాలో నటిస్తున్నారు కల్యాణ్‌రామ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటున్నది. ఇదిలావుండగా కల్యాణ్‌రామ్ మరో సినిమాకు ఓకే చెప్పారని తెలిసింది. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి పరశురామ్ దర్శకత్వం వహిస్తారని సమాచారం. వీశీజఱవం'ఫ్యామిలీ స్టార్' పరాజయంతో దర్శకుడు పరశురామ్ కెరీర్‌కు కాస్త బ్రేక్‌నిచ్చారు. తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఓ యూనిక్ పాయింట్‌తో కథను సిద్ధం చేశారని తెలిసింది. దీనిని కల్యాణ్‌రామ్‌కి వినిపించగా ఆయన సానుకూలంగా స్పందించారని ఫిల్మ్‌నగర్ టాక్ వినిపిస్తున్నది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

# బాలీవుడ్‌లో సౌత్ మేకర్స్ డామినేషన్!





ఒకప్పుడు ప్రాంతీయ చిత్రాలుగా పరిమితమైన సౌత్ సినిమాలు ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హీరోల మధ్యే కాకుండా దర్శకుల మధ్య కూడా నెంబర్ గేమ్ నడు స్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా రేంజ్‌లో సౌత్ మేకర్స్ సాధిస్తున్న విజయాలు బాలీవుడ్ అగ్ర దర్శకులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఈ విప్లవానికి తెరతీసిన కెప్టెన్ దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి. -బాహుబలి- సిరీస్‌తో బిగ్ స్క్రీన్ మీద పాన్ ఇండియా ట్రెండ్‌ను మొదలుపెట్టిన జక్కన్న ఒక్కో సినిమాతో ఇండియన్ సినిమా రేంజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళు న్నారు. ఆయన ఆక్రమించిన ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ చైర్‌ను చేరుకునేందుకు బాలీవుడ్‌లోని ఎంతోమంది ప్రముఖ దర్శకులు కొంత కాలంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. కానీ రాజమౌళి సృష్టించిన మైలురాళ్లను అందుకోవడం సాధ్యం కావడం లేదు. రాజమౌళి బాటలోనే సుకుమార్ నడుస్తున్నారు. -పుష్ప 2- లెక్కల మాస్టర్ ఇండియన్ మేకర్స్‌కు మరో సరికొత్త దారి చూపించారు. అసాధ్యం అనుకున్న విషయాలను కూడా బాక్సాఫీస్ వద్ద సాధ్యం చేసి చూపించి సౌత్ సత్తా ఏమిటో మరోసారి నిరూపించారు. మరో క్రేజీ కెప్టెన్ సందీప్ రెడ్డి వంగా నెంబర్ గేమ్‌లో ముందుకు దూసుకెళ్లారు. పాన్ ఇండియా రేంజ్‌లో ఆయన సృష్టించిన క్రేజ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంది. ఇదే కోవలో నేషనల్ మార్కెట్‌ను వణికించిన మరో సౌత్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్. 'కేజీఎఫ్', 'కేజీఎఫ్ 2' వందల కోట్లు వసూళ్లను సాధించి సౌత్ డామినేషన్‌ను జాతీయ స్థాయిలో ప్రూవ్ చేశారు. -కల్కి 2898- విజయంతో నాగ్ అశ్విన్ సంచలనంగా మారారు. సైన్స్ ఫిక్షన్ సినిమాలు తీయడంలో తానో మాస్టర్ తొలి అటెంప్ట్ లోనే ప్రూవ్ చేసారు. -కల్కి 2- విజయం సాధిస్తే నాగీ ఇమేజ్ విశ్వవ్యాప్తమవుతుంది. ఈ ఐదుగురు దర్శకులు సృష్టించిన సునామీని తట్టుకునేందుకు బాలీవుడ్ నుంచి సిద్ధార్థ్ ఆనంద్, అయాన్ ముఖర్జీ లాంటి ప్రముఖ మేకర్స్ ఎంతో ప్రయత్నించినా? బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో నిలదొక్కుకోలేకపోయారు. అయితే ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రీసెంట్‌గా -ధురందర్- సిరీస్‌తో భారీ బ్లాక్‌బస్టర్‌ను అందించిన ఆదిత్యధర్ సడన్‌గా రేసులోకి దూసుకొచ్చారు. సౌత్ డామినేషన్‌కు చెక్ పెడుతూ బాలీవుడ్‌లోనూ బలమైన దర్శ కులు ఉన్నారనే సంకేతాన్ని పంపించారు. అయినా ఆధిపత్య పోరులో బాలీవుడ్‌కు పూర్తి స్థాయి కాన్ఫిడెన్స్ రావాలంటే? మరింత మంది దర్శకులు పాన్ ఇండియాలో విజయాలు అందించాలి. అప్పుడే సౌత్ తో సమానంగా పోటీ పడే సత్తా బాలీవుడ్ మేకర్స్‌కు పూర్తిగా వచ్చిందా ?లేదా? అన్న అంశంపై స్పష్టత వస్తుంది.

# చిన్న సినిమాల్లోనే దమ్ముంటుంది


## : 'కర్మాఖ్య' ఈవెంట్‌లో విజయశాంతి



కొత్త ఆలోచనలు, వినూత్న కథలతో వచ్చే చిన్న సినిమాలకు ప్రేక్షకులు, మీడియా నుంచి మరింత ప్రోత్సాహం అందాల్సిన అవసరం ఉందని ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతి అభిప్రాయపడ్డారు. అలాంటి చిత్రాలకు సరైన గుర్తింపు దక్కితే తెలుగు సినీ పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. 'అదిరే అభి' (అభినయ కృష్ణ) దర్శకత్వంలో తెరకెక్కిన 'కర్మాఖ్య' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయశాంతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వేడుకలో విజయశాంతి మాట్లాడుతూ... "పెద్ద సినిమాలతో పోలిస్తే చిన్న చిత్రాలకు లభించే మద్దతు కాస్త తక్కువే అయినప్పటికీ, నిజమైన దమ్ము, కొత్తదనం, బలమైన కథలు చిన్న సినిమాల్లోనే ఉంటాయి. ప్రేక్షకులు ఇలాంటి వైవిధ్యమైన ప్రయత్నాలను ఆదరిస్తే పరిశ్రమకు మరింత మంది కొత్త నటీనటులు, దర్శకులు వస్తారు. ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలు నిలదొక్కుకోవాలంటే మీడియా సహకారం చాలా అవసరం. కొత్త కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడంలో మీడియానే కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. 'కర్మాఖ్య' సినిమాలో నటించిన అభినయ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ... ఈ పాత్ర కోసం ఆమె గుండు చేయించుకోవాల్సిన అవసరం లేదని, కానీ కథపై ఉన్న అంకితభావంతోనే అలా చేశారని విజయశాంతి అభినందించారు. ఆమె పడిన కష్టానికి ప్రేక్షకులు కచ్చితంగా పెద్ద విజయాన్ని అందిస్తారనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఇక తన నటన కెరీర్ పై స్పందిస్తూ... ప్రస్తుతం తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నందున నటించే ఆలోచన లేదని... అయితే బలమైన కథ, గుర్తుండిపోయే మంచి పాత్ర వస్తే మాత్రం ఆలోచిస్తానని వెల్లడించారు. కాగా, ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ 'కర్మాఖ్య' చిత్రం జూలై 31న థియేటర్లలోకి రానుంది.


జీవితం ఒక పరుగు
జననం
బాల్యం
ఆట
చదువు
కలలు
ప్రయాణం
ప్రేమ
శ్రమ
విజయం
ప్రార్థన
వృద్ధాప్యం
అంతం
Vivek Prem Rathnam Lecturer in Chemistry
Srichaithanya.
PERSONAL Coaching for NEET and JEE 9849818275


నిజం మా నిబద్ధత... ప్రజా ప్రయోజనం మా ధ్యేయం...
ది హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
ప్రతి ఇంటికి... ప్రతి చేతికి... నిజమైన వార్తలు
మా దినపత్రిక విస్తరణలో భాగంగా
రిపోర్టర్లు కావలెను!
జర్నలిజంపై ఆసక్తి కలిగిన, నిజాయితీ గల, సమాజంపై స్పందన కలిగిన అభ్యర్థులు మా బలమైన బృందంలో చేరండి.
స్టాపర్లు (స్ట్రింగర్లు)
మండల రిపోర్టర్లు
జిల్లా బ్యూరోస్
అన్ని నియోజక వర్గాలలో కావలెను
సంప్రదించవలసిన నెంబర్: 9951693876
ఎడిటర్
లక్ష్మీనారాయణ


HYDERABAD ESTATE TV CHANNEL
HYDERABAD
ESTATE TV CHANNEL
WANTED
STAFF REPORTERS, BURO CHIEFS & MANDAL REPORTERS
Hyderabad Estate TV Channel is inviting applications from enthusiastic and dedicated individuals for the following positions:
STAFF REPORTERS
BURO CHIEFS
MANDAL REPORTERS
Interested candidates are requested to contact:
Editor: LAXMINARAYANA
9951693876
Join our team and be a part of professional journalism!


HYDERABAD ESTATE TV CHANNEL
VOICE OF HYDERABAD
TRUTH | TRUST | TRANSPARENCY
WE ARE
RECRUITING!
JOIN OUR DYNAMIC TEAM
POSITIONS OPEN
STAFF REPORTERS
For News Coverage & Reporting
BURO CHIEFS
For Regional News Operations
MANDAL REPORTERS
For Local News & Updates
WE ARE LOOKING FOR
Passionate about Journalism
Good Communication Skills
Commitment & Dedication
Experience in Field Reporting is an Advantage
BE A PART OF A GROWING NEWS NETWORK
INTERESTED CANDIDATES PLEASE CONTACT
9951693876
EDITOR
LAXMINARAYANA
Let's Report. Let's Inform. Let's Make a Difference.